క్లుప్తంగా

ఘనంగా వీడ్కోలు సమావేశం



సమావేశంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

సంగారెడ్డి :మండలంలోని కల్పగూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ మాట్లాడుతూ.. పది విద్యార్థులు మంచి ఉతీర్ణత సాధించి తల్లిదండ్రులకు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు డ్యాన్స్‌తో అలరించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ ఉప సర్పంచ్ అజయ్‌కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకటాపూర్‌లో డీఎల్పీఓ పర్యటన



నీటి నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మిషన్ భగీరథ తాగు నీరు కలుషితంపై సాక్షిలో ప్రచురితమైన ‘బాబోయ్.. భగీరథ’ అనే కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం డీఎల్పీఓ అనిత ఆధ్వర్యంలో పలు శాఖల అధికారులు గ్రామానికి వెళ్లి నీటి పరీక్షలు నిర్వహించి, తాగునీటి నాణ్యతను పరిశీలించారు. ప్రజలకు శుద్ధి చేసిన నాణ్యమైన తాగునీటిని సరఫరా చేస్తామన్నారు. ఆమె వెంట ఏఈలు రవి కుమార్, ప్రియాంక, ఎంపీఓ సంతోష్ కుమార్, పంచాయతీ కార్యదర్శి ఇమ్రాన్ ఉన్నారు.

కట్ట మైసమ్మకు ప్రత్యేక పూజలు



కట్టమైసమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని కిష్టారెడ్డిపేటలో నూతనంగా నిర్మించిన కట్ట మైసమ్మ దేవాలయం విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో మంగళవారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలన్నారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ కృష్ణ, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు తెలియజేయండి



రైతులతో మాట్లాడుతున్న భాస్కర్‌రావు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని లక్ష్మీపతిగూడెం, వావిలాల, నల్లూర్, ఖాజీపల్లి, గడ్డపోతారం గ్రామాల్లో మంగళవారం డివిజన్ విద్యుత్ అధికారి భాస్కర్‌రావు పర్యటించారు. వేసవికాలం దృష్ట్యా రైతులతో మాట్లాడారు. ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరు, విద్యుత్ సరఫరాలో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని రైతులకు చెప్పారు. విద్యుత్ అధికారులు రైతులతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో గుమ్మడిదల ఏడీఈ దుర్గాప్రసాద్, జిన్నారం ఏఈ వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

నీటి సరఫరా బంద్

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలంలోని గౌసాబాద్ ప్రజలకు రెండు మూడు రోజుల నుంచి మిషన్ భగీరథ నీరు సరఫరా నిలిచిపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు.గౌసాబాద్ తండా సమీపంలో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ అవుతుండటంతో నీటి సరఫరా ఆగిపోయింది. పైపులైన్‌కు సకాలంలో మరమ్మతులు చేపట్టనందున బిందెడు నీటి కోసం దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

విద్యాభివృద్ధికి అండగా..

నారాయణఖేడ్: విద్యాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి సతీమణి అనుపమారెడ్డి అన్నారు. మంగళవారం ఆమె సొంత ఖర్చుతో స్థానిక జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినిలకు ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్ డిక్షనరీలు, అట్లాస్ పుస్తకాలు అందజేశారు.



పచ్చగా కళకళలాడుతున్న ఐఐటీహెచ్ ప్రవేశ ద్వారం



బిల్డింగ్‌ల చుట్టూ రంగురంగుల పూల మొక్కలు



ఆకట్టుకుంటున్న ఐఐటీహెచ్ ఆకారం

అందంగా.. ఆహ్లాదంగా..

ఐఐటీ హైదరాబాద్ ఆవరణలో ఎటు చూసినా అందమైన భవనాలు దర్శనమిస్తున్నాయి. పచ్చని చెట్లు, పూల మొక్కలు స్వాగతం పలుకుతున్నాయి. గార్డెన్‌లో పరిచిన గడ్డి పచ్చని తివాచీలా కనిపిస్తుంది. ప్రవేశ ద్వారం వద్ద పచ్చదనంతో ఏర్పాటు చేసిన ‘ఐఐటీహెచ్’ అందరిని ఆకట్టుకుంటుంది. -సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

అభివృద్ధికి ఆమడదూరంలో హోతి(కె)

- మున్సిపల్‌లో విలీనంతో సమస్యలు
- మౌలిక వసతులు లేక ఇబ్బందులు

జహీరాబాద్ టౌన్: మండలంలోని హోతి(కె) గ్రామం అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. గ్రామ పంచాయతీని మున్సిపాలిటీలో విలీనం చేసిన తరువాత అభివృద్ధి పనులు చేసే వారు కరువైయ్యారు. నిధుల కొరత, అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రగతికి ఆటంకం ఏర్పడుతున్నాయి. మున్సిపాలిటీ విస్తీర్ణంలో భాగంగా చుట్టూ పక్కల ఉన్న ఐదు గ్రామ పంచాయతీలను ఐదారు సంవత్సరాల క్రితం మున్సిపల్‌లో విలీనం చేశారు. మండలంలోని హోతి(కె) పట్టణానికి సుమారు నాలుగు కిలో మీటర్ల దూరంలో ఉంటుంది. ఈ గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేయొద్దని ప్రజలు అధికారులను కోరారు. ప్రజాప్రతినిధులను కలిసి వినతి పత్రాలు కూడా అందజేశారు. అయినప్పటికీ పురపాలక సంఘంలో విలీనం చేశారు. దీంతో గ్రామస్తులు కోర్టుకు వెళ్లారు. కోర్టులో కేసు ఉన్నందున గ్రామాభివృద్ధి గురించి మున్సిపల్ అధికారులు పట్టించుకోలేదు. హోతి(కె)ను మున్సిపల్‌లో విలీనం చేయవచ్చని ఏడాది కిందట కోర్టు తీర్పు ఇచ్చింది. అప్పటి నుంచి కూడా అభివృద్ధిపై దృష్టి పెట్టడం లేదు. ఐదారు సంవత్సరాల నుంచి ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టని కారణంగా రోడ్లు ఆధ్వానంగా తయారయ్యాయి. మురికి కాలువలు



రోడ్డుపై నుంచి పారుతున్న మురికి నీరు



కరెంట్ తీగలు వస్తున్న స్పార్క్

లేక మురుగు నీరు రోడ్లపైనే పారుతోంది. గ్రామంలో సీసీ రోడ్డు. పారిశుద్ధ్యం వంటి పనులు చేయడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఎన్నో సంవత్సరాల క్రితం ఇళ్ల పైనుంచి వేసిన కరెంట్ లైన్లు పాతబడి ప్రమాదకరంగా మారాయి. మున్సిపల్‌కు కౌన్సిల్ లేక గ్రామం గురించి పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో గ్రామ సమస్యలు ఎవరికి చెప్పాలో అర్థంకావడంలేదని అంటున్నారు. ప్రతి చిన్నపనికి దూరంగా ఉన్న మున్సిపల్ కార్యాలయానికి వెళ్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి హోతి(కె)ని అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం



తాటిపల్లి హైస్కూల్‌లో స్వయం పాలన దినోత్సవం

మునిపల్లి(అందోల్): మండలంలోని తాటిపల్లి, మునిపల్లి, అంతారం పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులు స్వయంపాలన దినోత్సవం మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎంఈఓ, డీఈఓ, కలెక్టర్ విధులు ఎలా నిర్వహిస్తారో తోటి విద్యార్థులకు తెలియజేశారు. మునిపల్లి హైస్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులకు గంధం సరస్వతీ ఫౌండేషన్ వారు పరీక్ష ప్యాడ్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఇంద్రేశం పాఠశాలలో..

ఇంద్రేశం ప్రభుత్వ పాఠశాలలో..

పటాన్‌చెరు టౌన్: విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలను బోధించి ఆకట్టుకున్నారు. మండలంలోని ఇంద్రేశం ప్రభుత్వ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. హెచ్ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి ఎంతటి బాధ్యతాయుతమైనదో తెలుసుకోవడానికి స్వయంపాలన దినోత్సవాలు తోడ్పడుతాయని తెలిపారు. హెచ్ఎంగా 8వ తరగతి విద్యార్థి దేవన్ శర్మ, ఎంఈఓగా నవీన్ వ్యవహరించారు.

తాగునీటి సరఫరా... పనులు అరకొర



నల్లాను ప్రారంభిస్తున్న అధికారులు



పైప్‌లైన్ లీకై ఏరులై పారుతున్న నీరు

ప్రారంభం రోజే లీకేజీలు

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధి బీసీకాలనీలో మిషన్‌భగీరథ తాగునీటి సరఫరాను మంగళవారం మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. అదే రోజు మరో వీధిలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ అయింది. దీంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మిషన్ భగీరథ అధికారులు, సిబ్బంది అలసత్వంతోనే అస్తవ్యస్త పనులు చేపట్టి లీకేజీలకు కారణమయ్యారని తీవ్రంగా విమర్శించారు. ఇప్పటికే ట్రయల్స్ నిర్వహించిన లీకేజీలు మాత్రం అడపాదడపా లోపాలను ఎత్తిచూపుతున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా తాగునీరు అందిస్తారనుకునే సమయంలో ఒక్కసారిగా మిషన్ భగీరథ జలాలు పెద్ద ఎత్తున లీకై కాలనీల్లో వరదలను తలపిస్తున్నాయని మండిపడ్డారు. వ్యవహారంపై ఉన్నతాధికారులు స్పందించి తమకు తాగునీరు సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని ముక్తకంఠంతో కోరుతున్నారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు



కాషాయ జెండాలతో నాయకులు



టీపీయూఎస్ ఆధ్వర్యంలో ..

పటాన్‌చెరు టౌన్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బీజేపీ, తపస్ బలపర్చిన అభ్యర్థి మల్క కొమరయ్య గెలుపుతో బీజేపీ శ్రేణులు డివిజన్ పరిధిలోని శ్రీనగర్‌కాలనీ బసవేశ్వర విగ్రహం వద్ద టపాసులు పేల్చి, స్వీట్లు పంచిపెట్టారు. అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. యూనియన్లకు అతీతంగా మోదీ నాయకత్వంపై విశ్వాసంతో ఉపాధ్యాయులు మల్క కొమరయ్యకు ఓట్లు వేసి గెలిపించారని తెలిపారు. మొదటి ప్రాధాన్యత ఓట్లతో గెలిపించి చరిత్ర సృష్టించారన్నారు. కార్యక్రమంలో పటాన్‌చెరు మండల అధ్యక్షుడు వీరేశం, పట్టణ అధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి పాల్గొన్నారు.

జిన్నారం మండల కేంద్రంలో

జిన్నారం (పటాన్‌చెరు): మెదక్, నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా మల్కా కొమురయ్య విజయం సాధించడంపై టీపీయూఎస్ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. జిన్నారంలో విజయోత్సవాలను నిర్వహిస్తూ స్వీట్లు పంపిణీ చేశారు. టీపీయూఎస్ సంఘం నాయకులు విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. కొమురయ్య విజయంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

మందుబాబులకు జరిమానా

సంగారెడ్డి క్రైమ్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా న్యాయస్థానం జరిమానా విధించిన సంఘటన పట్టణ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సంగారెడ్డి ట్రాఫిక్ సీఐ సుమన్‌కుమార్ కథనం ప్రకారం.. సోమవారం పోతిరెడ్డిపల్లి, పాత బస్టాండ్, బైపాస్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో పదిహేను మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని మంగళవారం కోర్టు లో హాజరుపరచగా జిల్లా అదనపు న్యాయమూర్తి ముగ్గురికి రూ.1500, మిగతా పన్నెండు మందికి రూ.1000 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీస్‌లు పేర్కొన్నారు.

18 మందికి..

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. సోమవారం నిర్వహించిన తనిఖీల్లో 18 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని కోర్టులో హాజరుపరచగా 15 మందికి రూ. వెయ్యి, మరో ముగ్గురికి రూ. 1500 జరిమానా విధించారు.

పిచ్చిమొక్కల తొలగింపు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని ప్రియదర్శినికాలనీ క్వార్టర్స్‌లో మంగళవారం వార్డు కాంగ్రెస్ ఇన్‌చార్జి మఠం వీరన్నస్వామి రోడ్లకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను జోజర్‌తో తొలగించారు. క్వార్టర్స్‌లో పిచ్చిమొక్కలు పెరగడంతో విషపురుగులు ఇళ్లలోకి వస్తున్నాయని ప్రజల విన్నపం మేరకు పిచ్చి మొక్కలు తొలగించామన్నారు.

బాల్యవివాహాలు చేస్తే కఠిన చర్యలు



ప్రమాణం చేస్తున్న సీడీపీఓ, వైద్య సిబ్బంది

కంగ్టి(నారాయణఖేడ్): పిండం నిర్ధారణ పరీక్షలు, బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఐసీడీఎస్ సీడీపీఓ సుజాత హెచ్చరించారు. మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మిషన్ శక్తిలో భాగంగా బేటీ బచావో.. బేటీ పడావో పై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు, లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టం పూర్తిస్థాయిలో అమలయ్యేలా తమ వంతు కృషి చేస్తామని వైద్య ఆరోగ్య శాఖ, అంగన్‌వాడీ సిబ్బంది ప్రమాణం చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగమణి, జెండర్ స్పెషలిస్ట్ యాదగిరి, ఎస్ఎఫ్ఎల్ నర్సింలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుజాత, మంజుల, ఎంఎల్‌హెచ్‌పీలు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీకి ఆయువు పట్టు

కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు: గాంధీభవన్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెదక్ పార్లమెంట్ సమీక్ష సమావేశంలో కాంగ్రెస్ నేత నీలం మధు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్ కార్యకర్తల కష్టంతోనే అధికారంలోకి వచ్చామన్న విషయాన్ని నాయకులు గుర్తుంచుకోవాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను విరివిగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి నాయకుడిపై ఉందన్నారు. నాయకులు విభేదాలు పక్కన పెట్టి కలిసికట్టుగా పని చేసి స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. అనంతరం నీలం మధు



సమావేశంలో మాట్లాడుతున్న నీలం మధు

మాట్లాడుతూ.. కార్యకర్తలను గౌరవిస్తూ వారి ప్రతి కష్టసుఖాల్లో అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ముఖ్య నాయకులు నియోజకవర్గ ఇంచార్జిలు, డీసీసీ ప్రెసిడెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌ఫెస్ట్‌లతో సృజనాత్మకత మెరుగు



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న పర్యవేక్షణాధికారులు

సంగారెడ్డి టౌన్ : విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించేందుకు సైన్స్ ఫెస్ట్‌లు దోహదపడతాయని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఇందిరా ప్రియదర్శిని అన్నారు. మంగళవారం సంగారెడ్డి మండలంలోని ఇస్మాయిల్ ఖాన్‌పేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సృజన టెక్ ఫెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాలోని కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రణాళికబద్ధంగా లక్ష్యాలను అందుకోవాలని విద్యకు సాంకేతికతను జోడిస్తే ఉన్నత శిఖరాలను అందుకోవచ్చన్నారు. విద్యార్థులు చేసిన సాంకేతిక ప్రదర్శనలను పరిశీలించడానికి బీఎస్ఎన్ఎల్ సబ్ డివిజనల్ ఇంజనీర్ రమేష్ అజ్మీరి, రత్నపురి కళాశాల ప్రిన్సిపాల్ క్రాంతి కుమార్ హాజరయ్యారు. అనంతరం ప్రయోగాలను పరిశీలించి రెండు కళాశాలల విద్యార్థులను విజేతలుగా ప్రకటించారు. జోగిపేట్ కళాశాల మొదటి, సిద్దిపేట కళాశాల రెండవ బహుమతి పొందారు. అనంతరం విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **నా కారు నావద్దనే ఉంది..**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కుంభమేళాలో కారును మర్చిపోయారంటూ ఓ వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో నివాసం ఉండే సాకేత్ ప్రకాష్‌వాగ్ మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కొద్ది రోజుల క్రితం తన కుటుంబ సభ్యులతో కలసి కుంభమేళాకు వెళ్లామని.. అక్కడ తన కారును పార్కింగ్ చేసి నడుచుకుంటూ వెళ్లి దైవదర్శనం చేసుకొని తిరిగి క్షేమంగా ఇంటి చేరామన్నారు. గత కొద్ది రోజులుగా దుమ్ముపట్టిన తన కారు అక్కడే మర్చిపోయినట్లు ఓ వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అవుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దయచేసి ఆ వీడియోను వైరల్ చేయొద్దని కోరారు.

◆ **ఇంటర్ విద్యార్థి అదృశ్యం**



మనీష్ (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: ఇంటర్ విద్యార్థి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. డివిజన్ పరిధిలోని ముదిరాజ్ బస్తీకి చెందిన సాయిమనీష్ రామచంద్రపురం పరిధిలోని వెలమెల తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం కాలేజీ వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. తెలిసిన వారు, స్థానికంగా వెతికిన ఆచూకీ లభించలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

◆ **మాతృభాషను మరవద్దు**

నారాయణఖేడ్: మాతృభాషను మరవద్దని ఉస్మానియా యూనివర్సిటీ పూర్వ ఆచార్యులు డాక్టర్ కసిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఖేడ్ మండలం చాప్టా(కె) ఉన్నత పాఠశాలలో మంగళవారం హెచ్ఎం నర్సింహులు అధ్యక్షతన అష్టావధానం, పద్యకవి, తెలుగు ఉపాధ్యాయులు భూమయ్య రచించిన శ్రీరామ శతకం పుస్తకాన్ని కంది శంకరయ్య, రసగీతి సాహితీ సంస్థ వ్యవస్థాపకులు మహిపాల్‌రెడ్డి, అవధాని భానుప్రకాష్ ఆవిష్కరించారు. కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతంలో సాహిత్య సమావేశం నిర్వహించడంపై అభినందించారు.

◆ **పరీక్ష సామగ్రి పంపిణీ**

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మహాశ్ అన్న యువసేన ఆధ్యర్యంలో స్టేషనరీ, ప్యాడ్లు అందజేశారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ.. మారుమూల గ్రామాలకు చెందిన విద్యార్థులను ప్రోత్సహించడానికే పరీక్షా సామగ్రి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

◆ **ముగ్గురికి గాయాలు**

రాయికోడ్(అందోల్): రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన మండలంలోని చిమ్నాపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ నారాయణ కథనం ప్రకారం.. కంగ్టి మండలం భీమ్‌రా గ్రామానికి చెందిన యాకోబు తాటిపల్లి గ్రామంలో తన బంధువుల శుభకార్యానికి కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యాడు. సోమవారం అర్ధరాత్రి యాకోబు, సచిన్, సీమన్‌లు కారులో తాటిపల్లి నుంచి చిమ్నాపూర్‌కు వెళ్తున్నా క్రమంలో ఓ దాబా సమీపానికి రాగానే ఎదురుగా వస్తోన్న కారుకు సైడ్ ఇచ్చే క్రమంలో ఎడమ వైపు ఆగి ఉన్న లారీని కారు ఢీ కొట్టింది. ప్రమాదంలో గాయపడిన ముగ్గురిని జహీరాబాద్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


◆ **నియోజకవర్గ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా అస్మ తబస్సుం**



జహీరాబాద్ టౌన్: నియోజకవర్గం మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా అస్మ తబస్సుం నియమితులైయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షురాలు సుధా నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు ఆమె ఎంపీ. సురేష్ షెట్కార్, కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, పార్టీ ఇన్‌చార్జి చంద్రశేఖర్, అధ్యక్షురాలు సుధాలకు కృతజ్ఞతలు తెలిపారగీ సందర్భంగా పార్టీ అభివృద్ధికి పాటు పడుతానని అన్నారు.

‘హరిత.. హతం’పై చర్యలేవీ?

సంగారెడ్డి టౌన్ : హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన చెట్లను కొందరు నరికివేస్తున్నారు. చెట్లను నాటే నాటడం కాదు?.. వాటి సంరక్షించడం కూడా ముఖ్యమే అంటూ.. చెప్పిన అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. దీంతో నిత్యం ఏదో ఒకచోట చెట్లు నేలకొరుగుతున్నాయి. సంగారెడ్డి మండలంలోని సదాశివనగర్‌లో హరితహారంలో నాటిన చెట్లను నరికివేసి.. రోడ్లపై ఇష్టమొచ్చినట్లు పడేశారు. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వం వేల రూపాయలు ఖర్చు చేసి చెట్లను నాటి సంరక్షిస్తుండగా కొంతమంది ఇలా చెట్లను నరికి వేస్తుండటంపై పర్యావరణ ప్రేమికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెట్లను నరికే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



సదాశివనగర్‌లో రోడ్డు పక్కన నరికిన చెట్లు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. చంద్రారెడ్డి -9912220353
కె. సంగారెడ్డి -9010294400